# సెగలేని పొగ

నిజంగా నాకా విషయం తెలీదు. అసలు రాజారావును గురించి నాకే విషయము తెలీదు. అందరికీ తెలిసినవే నాకూ తెలుసు. ఆయన ఒక బ్యాంకులో ఆఫీసరని, ఆయనకు భార్యా, ముగ్గురు పిల్లలున్నారని, అతి ముభావంగా వుంటాడని నాకూ తెలుసు. ఆయన మనస్తత్వం అర్థం చేసుకోవటం చాలా కష్టమని, ఆయనతో సన్నిహితంగా వుంటున్న వాళ్ళల్లో కొంతమంది అభిప్రాయం. ఇట్లా అనుకోవటం, ఆయన మీద నింద మోపటమేనని నా ఉద్దేశం. ఆయన చాలా నిదానస్తుడు. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోడు. తన విషయంలో యితరులు శ్రద్ధ చూపటం గాని, అసక్తి కనపరచటంగాని! ఆయనకు యిష్టం వుండదు. ఏ వ్యక్తి మీద కూడా, తనకున్న అభిప్రాయాన్ని వెల్లడించడు. వ్యక్తుల మీద అభిప్రాయాలు బాహాటంగా చెప్పటం తప్పని ఆయన ఉద్దేశం కావచ్చు. నిజానికి మనకు ఎవరిని గురించి కూడా అన్ని విషయాలు తెలియవు. అందుకనే ఇతరుల గురించి మనం

చెప్పటమనేది తగనిపనే. అలాంటప్పుడు రాజారావును గురించి నేను ఏమనుకుంటే ఏం ప్రయోజనం?

రాజారావు నా కున్నా ముఖ్య స్నేహితుల్లో ఒకడు. మేమిద్దరం తరచు కలుస్తూనే వుంటాం. ఆయన మాటల్లోనూ, చేతల్లోనూ హుందాతనం కనిపిస్తూ వుంటుంది. నిదానంగానూ, తాపీగానూ మాట్లాడతాడు. ఏ ప్రశ్నకైనా సమాధానం యివ్వాలని తాపత్రయపడడు. అంత మాత్రంచేత ఆయన మాట్లాడిన ప్రతి మాటకు వెనకాల గూఢార్థం వుంటుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. అతనిని "స్టడీ" చేయాలనే దృష్టి నేను ఎప్పుడూ ఆలోచించలేదు. అలాంటి సందర్భాల్లోకి దిగనూ లేదు. ఆయన సరసుడు, స్నేహపాత్రుడు, సౌజన్యుడు.

అందుకని, రాజారావు బ్యాంకులోని డబ్బు తీసుకుని పారిపోయాడంటే నమ్మలేకుండా వున్నాను. దొంగతనంగా డబ్బు తీసుకుని పారిపోవలసిన స్థితికి అతను దిగజారడని నా విశ్వాసం. ఏ యితర కారణాల ప్రోద్బలం వలన కూడా యిలాంటి పనిచెయ్యడు అని నాకు నమ్మకం. కాని అంతమొత్తం డబ్బు ఆయన రాత్రికి రాత్రి ఎత్తుకుపోయాడని పోలీసులు వెతుకుతుంటే, నాకు మతిపోయినట్లనిపించింది. విస్తుపోయాను. పోలీసు ఆఫీసరు రాజారావును గురించి నన్ను అజ్ఞాతంపై ప్రశ్నలు వెయ్యటం, ఆదొంగతనానికి, చాటుగావున్న రహస్యాన్ని నా దగ్గర్నుంచి రాబట్టాలనే ప్రయత్నం మరీ ఆశ్చర్యంగా వుంది. అసలు ఆ దొంగతనం సంగతి నాకు తెలీదు. దాని వెనకాల వున్నదని చెప్పబడుతున్న, రహస్య విషయం అంతకంటె తెలీదు. అసలు అతను అంతడబ్బు ఎందుకు ఎత్తుకు పోయాడంటాడు అని నేను పోలీసు ఆఫీసర్ని

అడుగుతే, ఆయన మండిపడ్డాడు ఇప్పుడు మిమ్మల్ని వేస్తున్న ప్రశ్న అదేనని, నన్ను కసురుకున్నాడు. నాకేదీ తెలీదంటే నమ్మటంలేదు. వత్తిడిచేసి నాచేత అబద్ధం చెప్పించి దాన్నే నిజంగా చెలామణి చేయాలనే ఆ పోలీసు ఆఫీసరు మనస్తత్వం మహాభయంకరంగా నన్ను బాధిస్తోంది. నాకు అబద్ధాలు చెప్పే అలవాటు ఎప్పుడూ లేదు సత్యము, అసత్యము అనే పెద్దమాటలకు నాకు అర్థాలు తెలియవు. జరిగినది జరిగినట్లు చూసినది చూసినట్లు తెలిసింది తెలిసినట్లు చెప్పడం, యిదే నాకు మొదటి నుంచీ అలవాటు. దాచి చెప్పటం నాకిష్టం లేదు. ఏమైనా, రాజారావు బ్యాంకులో డబ్బు ఎత్తుకుపోయిన విషయం నాకు తెలీదంటే మాత్రం పోలీసు ఆఫీసరు నమ్మటం లేదని తేలిపోయింది ఇప్పుడు ఏం చేసేటట్టు!

పోలీసు ఆఫీసరు కాసేపు ఆలోచించి యింకొక ప్రశ్న వేశాడు. ఈ ఫోటోలోవున్న వ్యక్తిని మీరు గుర్తు పట్టగలరా అని ఒక అందమైన అమ్మాయి ఫోటో చూపించాడు. ఆమె నాకు తెలుసు బాగా తెలుసు. ఆమె పేరు కస్తూరి. నాతోపాటు రాజారావుతోపాటు, అనేకసార్లు క్లబ్బులకు, సినిమాలకు వచ్చింది. ఆమె భర్త ఆమెకు స్వేచ్ఛ యిచ్చేశాడు. ఆమె మీద ఆమె భర్తకున్న విశ్వాసాన్ని చాలాసార్లు ప్రశంసిస్తూ మా స్నేహితులు, రాజారావు ఎదుట నా ఎదుట అంటూ వుండేవాళ్ళు. ఆమె ఆత్మవిశ్వాసాన్ని మనం గౌరవించాలని, నేను అంటూ వుండేవాన్ని. కస్తూరి స్వతంత్రంగా ఆలోచించగలదు. ధైర్యంగా మాట్లాడగలదు ఈ గుణాలే నన్ను ఆకర్షించినాయి ఆమెతో నాకు ఎక్కువ సన్నిహితంగా పరిచయమయిందని చెపితే. నిజం వెల్లడించినట్టే అవుతుంది. రాజారావుతో అంతా చనువుగా వుండేది కాదని కూడా నాకు తెలుసు.

అన్నట్టు నాకు పెళ్ళికాలేదు. అంటే నేను పెళ్ళి చేసుకో లేదు. చేసుకోదలచుకోలేదు కూడా. నేను పెళ్ళి చేసుకోదలచుకోక పోవటానికి కారణాలు చాలా వున్నాయి. కాని అవి అప్రస్తుతం కాబట్టి చెప్పటంలేదు ఇప్పుడు చెప్పేతుందంతా ప్రస్తుతమా అని ఎవరైనాఅడిగితే, నేను ప్రత్యేకంగా ఏమీ సమాధానం చెప్పలేను. అయితే సమాధానం వారికి దొరక్కమానదు కస్తూరిగృహస్థురాలు. ఇంకోవిధంగా ఆమెనుచిత్రించటంనాకిష్టంలేదు. ఆమెమనస్తత్వానికి అనుగుణంగా, పాపపుణ్యాల నిర్వచనాలు వూహించుకుంది. వాటిల్లో కొన్ని నా భావాలకు సరిపోయినాయి. అందుకనే మేమిద్దరం అంత సన్నిహితంగా వుండగలిగాము. అయినా కూడా, రాజారావు డబ్బు దొంగిలించాడనే నేరానికి కస్తూరికి ఏమాత్రం సంబంధం వుంటుందని నేను ఊహించటంలేదు.

ఆ పోలీసు ఆఫీసరు కస్తూరిని గురించి వివరాలు అడుగు తున్నాడు. నాకు తెలిసినంత వరకు చెప్పాను. రాజారావుకు ఆమెను గురించిన అభిప్రాయం ఏముందో నాకు తెలీదని స్పష్టంగా చెప్పేశాను. రాజారావు నిగ్రహశక్తి గలవాడు. పెద్దమనిషి శరీర దౌర్బల్యాలకు లొంగిపోయే వ్యక్తిగాదు. కస్తూరి బాధ్యతలు తెలి సిన సబల. ఆమెను యింకో విధంగా అనుకోవటం నా కిష్టంలేదు. రాజారావుకు ఆమెను ఏదో అక్రమమైన సంబంధం వుందని' ఆ పోలీసు ఆఫీసరు అభిప్రాయపడటం సహించరానిది. అందులో ఈ విషయాన్ని గురించి నన్ను అడగట మనేది చాలా దారుణం. ఏ కారణాల వలన ఆయన అలాంటి నిర్ణయానికి వచ్చాడో నాకు తెలీదుగాని, అసలుఅలాంటిభావనేతప్పు. ఆ దొంగతనానికి, కస్తూరికి ముడిపెట్టడం మరీ అన్యాయం.

ఈ పోలీసులు ఎన్నడూ సూటిగా ఆలోచించరు. అన్నీ పెడ దోవనే చూస్తారు. అప్పటికిగాని అసలు విషయం బైట పడదేమొ! అందుకనే నిందితులు పోలీసుల దగ్గర నిజం చెప్పరు. నిజాన్ని చెప్పి నమ్మించలేమని వాళ్ళకు తెలుసు. నేరస్థులు వేరు. నింది తులు వేరు. నేరస్థు లందరూ నిందితులే. నిందితు లందరూ నేర స్థులు కారు. వీళ్ళిద్దరి మధ్య తేడా పోలీసులకు తెలీదు. అందు వలన నిందితులు చెప్పిన అబద్ధా లన్నింటిని కాగితాల మీద నింపి వాటిని వడబోసి, భూతద్దాల్లోంచి చూసి, నిజమనుకున్న దానిని బైటకు లాగుతారు. నిజానికి యింత అవస్థ యెందుకు! పోలీసు వారు నిజాన్ని నమ్ముతారు అనే అభిప్రాయాన్ని నిందితుల్లో యెందుకు కలగ చేయరో నాకు అర్థంకాదు ఇలాంటి అభిప్రాయం కలుగచేస్తే యింత పోలీసు సిబ్బంది అక్కర్లేదు. ఇంత డిటెక్టివ్ సి ఐ. డి. పని అనవసరమేమొ! వాళ్ళకి ఉద్యోగాలు కావాలిగా మరి! అయితే కేవలం ఉద్యోగాల కోసమే యీ తతంగం అంతా యేర్పాటయిందనుకోను. చాలామంది నేరస్థులు తప్పించుకోవాలని ప్రయత్నం చేయటం సహజమే. అయితే నేను నేరస్థుణ్ణి కాను. కేవలం నిందితుణ్ణి మాత్రమే. పైగా నిజమే చెపుతున్నా దాంతోనే చిక్కులన్నీ వస్తున్నాయి. మరి యీ బాధనుంచి తప్పించుకోవటం ఎట్లాగో అర్థం కావటంలేదు. ఆ పోలీసు ఆఫీసరవుతే నన్ను ఓకంట కనిపెడుతూనే వున్నాడు.

రాజారావు బ్యాంకులో డబ్బు దొంగిలించాడని చెప్పబడు తున్న రోజుకు ఒక్కరోజు ముందుగా వాళ్ళింట్లో పెద్ద ఘర్షణ జరి గిందట ఆయనకు, ఆయన భార్య శశికి పోట్లాట జరిగిందట. ఇద్దరూ ఒకరినొకరు తూలానాడారట. నాకసలేమీ తెలీదు. భార్యా

భర్తలు యేవో విషయాల్లో కీచులాడుకోవటం చాలాసార్లు చూశాను. కాని రాజారావు, భార్యతో మనస్పర్థ రాగల బలీయమైన కారణా లేమిటో ఊహించ లేకుండా వున్నాను. ఆ పోట్లాటను, డబ్బు పోవ టానికి సంబంధం యేమిటో అసలు అగమ్య గోచరం. కాని పోలీసు లవుతే, భార్యాభర్తల మధ్య జరిగిందని చెప్పబడుతున్న తగాదాకు అత్యంత ప్రాధాన్యం యిచ్చారు. శశిని ఎన్ని ప్రశ్నలు వేశారో అంతులేదు. ఆమె నిబ్బరంగా అన్నింటికి సమాధానం చెప్పింది. తన భర్త దొంగకాడని ఆయన దొంగతనం చేయలేదని, ఏదో తనకు తెలియని రహస్యం దీంట్లో యిమిడి వుంటుందని ఆమెగట్టిగా చెప్పింది. అంత హఠాత్తుగా యింట్లోంచి మాయమయి పోవటానికి గల కారణాన్ని మాత్రం ఆమె ఊహించలేకపోతోంది. ఆమెకు ఆశ్చర్యంగానే వుంది. కస్తూరి కూడా ఆనాటి నుంచి యింట్లో కని పించటం లేదని, ఆమె భర్త జగన్నాధం పోలీసు ఆఫీసరుకు చెప్పా డని తెలిసి నప్పుడు కూడా శశి తొణకలేదు. కస్తూరి ఎంత ఆకర్ష ణగా వున్నా, ఎంత మాటకారి అయినా తన భర్త, ఆమె వలలో పడడని ఆయన అలాంటి వాడుకాడని కూడా పోలీసు ఆఫీసరుకు చెప్పింది. కాని వాళ్ళు నమ్మరు. ఇక్కడే వుంది కిటుకంతా.

జగన్నాధాన్ని నిలవేసి అడిగారు. తన భార్య కస్తూరి, నాతోనూ రాజారావుతోనూ చనువుగా తిరగటం, తనకిష్టం లేదని' భార్య వినకపోవటం వలన, తాను ఏమీ చేయలేక పోయానని జగ న్నాధం చెప్పాడు. కస్తూరి చేసే పనులకు, తనకు యెంతమాత్రం భాధ్యత లేదని, తన అసమర్థత నంతా కస్తూరి ప్రవర్తనమీద నెట్టే శాడు. పోలీసులు, నలుగురూ, నాగులువైపులకు వెళ్ళి. రకరకాల విష యాలు సేకరించి అందరూ బుర్రలు వేడెక్కించుకుంటున్నారు. ఇన్ని

విభిన్న విషయాల మధ్య. సత్యం నల్లపూసయింది. అయితే మధించి మధించి, ఒక విషయాన్ని నలుగురిచేత వప్పించి, అదే నిజమని నమ్మి బైటకు బాహాటంగా ప్రకటించారు. అదేమిటంటే, రాజారావుకు కస్తూరికి అక్రమమైన సంబంధం వుంది. వాళ్లిద్దరి ప్రేమను పెళ్ళిగామార్చుకునే నిమిత్తం, పుష్కలంగా బ్యాంకునుంచి డబ్బు తీసుకుని యిద్దరూపరారయ్యారు. దీనికి వెనకాలగావుంటూ ఏమీ తెలియనట్టు నటిస్తూ, వారి అక్రమచర్యకు ప్రోత్సాహం యిస్తూ, అన్ని సదుపాయాలు కలుగచేసి, వాళ్ళను తప్పించుకుని పారిపోవటానికి సహాయం చేసింది నేను. దీంట్లో నాస్వార్థం యేమిటంటే, కొంత డబ్బు, రాజారావు భార్య శశిమీద నాకున్న మోజు. ఇది విన్న తర్వాత పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వాలో, పెద్దపెట్టున ఏడవాలో నా కర్థం కాలేదు.

పోలీసులు తమ అభిప్రాయం బలపడటానికి కావలసిన సాక్ష్యాన్ని సేకరిస్తున్నారు. వాళ్ళకు దొరికిన విషయాలన్నీ తామనుకున్నది బలపరుస్తున్నట్లు నిర్వచించుకుంటున్నారు. ఇంత దారుణంగా పోలీసులు ఆలోచిస్తున్నారంటే నాకు చాలా ఆశ్చర్యంగానూ, భయంగానూ వుంది. విషయాలన్నీ తెలుసుకుని ఓ నిర్ణయానికి రావటం సబబు. ముందరగానే ఒక నిర్ణయానికి వచ్చి, దానికి అనుగుణంగా సాక్ష్యాన్ని సేకరించటం వింతగానూ, వికృతంగానూ వుంది. రాజారావు భార్య చాలా ఉత్తమురాలు, ఆమెఅంటే నాకు చెడ్డ అభిమానం, గౌరవమూను, ఆమెను, ఆమె పిల్లల్ని చూస్తుంటే, రాజారావు అదృష్టవంతుడని అనుకుంటూ వుంటా. వాళ్ళ దాంపత్యంచూస్తుంటే, నేనుకూడా గృహస్థుణ్ణిఅవుతే బాగుండుననిపిస్తూ వుండేది. కాని శశిలాంటి భార్య దొరకటం సామాన్యం

కాదు. అందుకనే విరమించుకున్నా. నిజానికి శశిలాంటి అమ్మాయి నన్ను వరిస్తే, యీ వయస్సులో కూడా పెళ్ళి చేసుకోవటానికి సిద్ధమే. అంతమాత్రంచేత, నాకూ, శశికి యేదోసంబంధముందని తేల్చటం మాత్రం చాలా అన్యాయం, అక్రమం. కాని నేను ఏం చేసేటట్టు: శశి దగ్గరకు వెళ్ళి. పోలీసు ఆఫీసరు తాను తెలుసుకున్న సత్యాన్ని బైట పెట్టాడట. ఆమె మనసు ఎంత వికలమయి వుంటుందో, ఎంత బాధపడి వుంటుందో మరి. నేనూ చాలాసేపు మథన పడ్డాను. ఆలోచించు కున్నాను, శశి దగ్గరకు వెళ్ళి పోలీసు వారు చెప్పిందంతా అబద్ధం అని ఆమెకు నచ్చచెప్పి, ఆమెకు మనశ్శాంతి కలుగ చేద్దామనుకున్నా, కనీసం నా మీద, ఆమెకు యేదైనా దురభిప్రాయం కలిగితే, దాన్ని పోగొట్టటానికైనా నేను వెళ్ళి తీరాలని నిశ్చయం చేసుకున్నా.

నేను వాళ్ళింటికి వెళ్ళే సరికి శశి. పిల్లలకు ఎదురుగా, విచారంగా ఆలోచిస్తూ కూర్చుంది. నేను లోపల అడుగు పెట్టంగానే, 'శశి' అనే మాట నా నోటి వెంబడి అప్రయత్నంగా వచ్చేసింది. ఆమెను గురించే ఆలోచించటం, ఆమె మాటలే అనుకోవటంతో, ఆమె పేరే నాలుక మీదకు వచ్చేసింది. ఆమె త్రుళ్ళిపడి లేచి నిలబడింది. పమిటతో వళ్ళంతా కప్పుకుంది. కళ్ళు పెద్దవిచేసి నా వైపు అతి తీక్షణంగానూ, క్రోధంగానూ, నిర్లక్ష్యంగానూ చూసింది. అలాంటి వికృతమైన ఆకారంలో శశిని చూడటంయిదే మొదటి సారి. నా వళ్ళు ఝల్లుమంది. కాని ధైర్యాన్ని పుంజుకుని ఆమె వైపు నిశితంగా నేనూ చూశాను. ఆమె యీసడింపును సహించలేకపోయాను. నా నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోటానికి వచ్చిన వ్యక్తిగా నేను ప్రవర్తించ దలచుకోలేదు. చెర్రుమని కోపం

వచ్చింది. శశిగారూ' అంటూ గట్టిగా పిలిచాను. ఆమె చప్పున ఉలిక్కి పడింది.

నా వైపుకు హఠాత్తుగా చూసింది. నా కళ్ళల్లో గాంభీర్యం. ఆమె రౌద్రాన్ని తగ్గించేసింది. కళ్ళు టపటప మూస్తూ తెరుస్తూ, నేను చెప్పబోయేదాన్ని వినటానికి ఉద్యుక్తురాలయినట్లు కనిపించింది.

".... అంతా నేను విన్నాను. రాజారావు గారి మీదవేసిన నింద భరించరానిది. నా మనస్సు తపించి పోతోంది. విన్నది అబద్ధంఅని నాకు తెలిసినా, నిజమేమిటో నాకు అర్థం కావటంలేదు. నిజాన్ని మీ నోటినుండి విందామని వచ్చా. రాజారావు గారిమీద నాకున్న అభిమానం, గౌరవము ఎలాంటివో, మీ కివ్వాళ నేను చెప్పనక్కర లేదు. నాకున్న ఆత్మవిశ్వాసంతోనే మీ ఎదుట ధైర్యంగా నిలబడ గలిగాను. మన నిర్మలమైన మనస్సులు యితరులు మోపిన నిందలతో కలుషితాలు అవుతాయని నేను ఎన్నడూ అనుకోను...." గంభీరంగా నిలబడ్డాను.

శశి బిత్తరపోతూ, నా మొహంలోకి చూసింది. నాతో, ఏమి మాట్లాడాలో ఆమెకు అర్థం కావటంలేదు. నేను ఎన్నోసార్లు వాళ్ళింటికి వెళ్ళాను. ఆ కుటుంబంతో నాకు చాలా పరిచయమే. నన్ను చూసిన తర్వాత, ఆమె మనస్సులో చెలరేగిన అపోహల దాడి ఆమెను ఉక్కిరి బిక్కిరి చేసివుంటుంది. ఆమె తట్టుకోలేక, నావైపు తీక్షణంగా చూసి వుంటుంది. కాని ఆమె ఊహించింది, చాలా తప్పని పశ్చాత్తాప పడుతున్నట్లుగా, ఆమె మొహం చూస్తూ నేను అనుకున్నాను. అయితే ఆ మాట పైకి చెప్పటానికి ఆమెకుధైర్యం

చాలటం లేదేమొ! ఆమె వాలకం కనిపెట్టి, నేనే చొరవ చేసుకున్నాను.

'క్షమించండి. నేను మిమ్మల్ని 'శశీ' అని ఏకవచనముతో పిలిచాను. నిజంగా నేను అలాంటి పనిచేసి వుండాలిసింది కాదు. తొందరపడిన మాట నిజమే. కాని నా మనస్సు బాగా ఆరాటపడుతోంది. రాజారావు ఎక్కడికి వెళ్ళాడు. ఎందుకు వెళ్లాడు అనే ప్రశ్నలు నన్ను వెంటాడుతున్నాయి. ఆ ప్రశ్నలకు, సమాధానాలు, నా ఊహకు మించినవవుతున్నాయి. అయితే మీకు కొంచెమైనా, ఆయన జాడ గురించి తెలిసి వుండాలని నా నమ్మకం..." నే నింకా పూర్తి చెయ్యక మునుపే, ఆమె గబాలున తలెత్తి నా మొహంలోకి చూసింది. "…. మీరేమి మాట్లాడుతున్నారో, నాకేమి సమాధానం చెప్పాలో తెలీటం లేదు. అంతా అగమ్య గోచరంగా వుంది. నా కే మాత్రం తెలిసినా, యింత గాభరాగా వుండను. ఆయనిట్లా యింట్లో చెప్పకుండా ఎన్నడు కూడా ఎక్కడకీ వెళ్ళ లేదు. నాకు భయంగా కూడా వుంది. అందులో బ్యాంకులో డబ్బు పోయిందని కూడా అంటున్నారు. ఆ కస్తూరి కూడా అప్పటినుంచి కనబడటంలేదని చెపుతున్నారు. నాకు మతిపోతోంది, బాగా ఆయాసపడుతూ, నుదురును కుడిచేత్తొ నొక్కుకుంటూ కుర్చీలో కూలబడింది. ప్రక్కనే వున్న పిల్లలు ఏడవటం మొదలు పెట్టారు. నాకు కాళ్ళూ చేతులు ఆడలేదు. ఆమె కళ్ళు మూసుకుని అట్లాగే పడుకునివుంది. ఒకటి రెండుసార్లు పిలిచినా పలకలేదు. దభాలున ఆమె దగ్గరకు వెళ్లానేగాని, వెంటనే వెనక్కు అడుగువేశాను స్పృహ తప్పి పడిందేమో అని అనుమానం ప్రక్కింటి వాళ్ళను పిలవటానికీ మరింత భయం వేసింది. నిజంగా అంత భయపడాలసిన అవ

సరం యేమీ లేదు. నాలో నేను సమాధానపడి 'ఏమండి శశిగారు' అంటూ గట్టిగా అరిచాను.

ఆమె ఉలిక్కిపడి తల విదిలించి, చప్పున లేచింది. అటూ యిటూ కళ్ళార్పుతూ చూసింది. ఆమెకు స్పృహవచ్చినట్లుంది. పమిటకొంగుతో మొహాన్ని తుడుచుకుంటూ పిల్లల్ని దగ్గరకు తీసుకుంది. అప్పటికే అక్కడికి యిద్దరు ముగ్గురుచేరారు. వచ్చినవాళ్ళు నా మొహంలోకి వింతగా చూస్తున్నారు. వాళ్ళు ఏమి ఊహించుకోబోతున్నారో నాకు తెలిసిపోయినట్టు, వాళ్ల మొహాల్లోకి, బాగా కళ్ళువిప్పి చూశాను, శశి మావంక తటపటాయిస్తూ చూస్తోంది. ఆమెకూడా యేమన్నా గ్రహించిందో యేమో తెలీదుకాని, చప్పున అనేసింది, వీరు మావారి స్నేహితులని.

'అయితే ఆయన జాడేమన్నా తెలిసిందా అండీ' అన్నది అందులోఒకామె.

శశి తలవంచుకుంది. తెలియలేదని చెప్పటం యిష్టం లేక మెదలకుండా వూరుకున్నాను.

వాళ్ళేవో, ప్రశ్నలువేస్తూ పరామర్శిస్తున్నారు. శశిమాత్రం వాళ్ళ మాటలను పట్టించుకున్నట్లు కనబడలేదు ఆ విషయం గమనించి, వాళ్ళు మెల్లిగా వెళ్ళి పోయారు.

'శశిగారు, మిమ్మల్ని అడగ కూడదని తెలిసి, నేనొక ప్రశ్న అడుగు తున్నాను. రాజరావుగారు వెళ్ళేముందు ఒకరోజు మీరిద్దరు తీవ్రంగా ఘర్షణ పడ్డారని, ఆ ఘర్షణకు ఆయన వెళ్ళిపోవటానికి ఏదో సంబంధం వుందని చెపుతున్నారు ..' అని ఇంకా ముందు అనటానికి తటపటాయించారు.

శశి బిత్తరుపోయి చూసింది. ఆ ఘర్షణవిషయం, నాకెట్లా తెలిసిందా అని ఆశ్చర్యపడుతున్నట్టు శశి మొహం చూస్తేనే తెలుస్తోంది. ఎంత స్నేహితుడయితే మాత్రం, భార్యభర్తల మధ్య జరిగిన తగాదాలు, తనభర్త, ఇతరులకు యెందుకు చెప్పాలి అని బాధపడుతూ వుండాలి నేను ఎన్నైనా ఊహించ వచ్చు. కాని శశి, నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పటానికి మాత్రం తటపటాయిస్తోంది. స్పష్టంగా అర్థమవుతోంది. ఆమెమౌనాన్ని ఆట్టేపరీక్షగా చూస్తున్ననాకు, పోలీసుల అంచనానిజమేనేమోనని భయమేస్తోంది. ఆఘర్షణకు కారణము ఏమయివుంటుంది దేన్నిగురించి జరిగింది. ఒకవేళజరిగినా, రాజారావు, ఇంట్లోంచి వెళ్ళిపోవాల్సిన అవసరము, యేమిటి, అందులోనూ, బ్యాంకులో డబ్బు ఎత్తుకు పోవలసిన అవసరము యేమిటి, యీ ప్రశ్నలన్నీ మళ్ళీ మొదటికివచ్చినాయి.

'...ఆనాడు జగన్నాధంగారు మా యింటికి వచ్చారు....' తడబడుతూ అన్నది శశి.

జగన్నాధమా మీఇంటికా... అనుకున్నాను.

పెద్దగా నిట్టూరుస్తూ ... 'ఆయన నన్ను అన్నన్నిమాటలు అంటారని అనుకోలేదు. అయన పేరవుతె రెండుమూడు సార్లు విన్నాను గాని, ఆయనెవరో. ఆయనే చెప్పేదాకా నాకు తెలీనే తెలీదు తాను కస్తూరి భర్తనని ఆవేదనగా చెప్పుకున్నాడు. వాళ్ళ కాపరాన్ని, నేను పాడు చేస్తున్నానట. నా భర్తకు నేను బుద్ధిచెప్పుకోవాలట కస్తూరి యెంతో మంచిదయినప్పటికీ, నాభర్త ఆమె మనస్సును మార్చేస్తున్నారట. ఆ మాటలు నాకిపుడు గుర్తురావటంలా, ఆయన ఉద్రేకం, రౌద్రం చూస్తుంటే, నాకు వణుకు పుట్టుకొచ్చింది. అసలు ఇలాంటివి ఇంకొకరికి చెప్పటంకూడా తలవంపులే.

మీరు నా సొంత అన్నయ్య కంటె ఆప్యాయంగా వుంటున్నారు కాబట్టి, యీమాత్రమైనా చెప్పగలిగాను....' రాను రాను శాంతపడి పోయి, ఎట్లాగైనా కస్తూరికి నచ్చచెప్పి, ఆమెను మంచి మార్గంలోకి పెట్టటానికి...' అంటూ నీళ్ళు నమిలాడు....' శశి విషాదంగా నవ్వు తెప్పించుకుంది.

'ఇంతకీ జగన్నాథం సతి బిక్ష పెట్టమని మీదగ్గరకు వచ్చాడ న్నమాట...' హాయిగా నవ్వేశాను.

శశినవ్వేకుంది. నామనస్సుతేలికయింది. ఇట్టేవెనక్కుతిరిగే టప్పటికి ఒక పోలీసుఆఫీసరు, ఇద్దరుకానిస్టేబుల్స్ నిలబడివున్నారు. గుండె ఝల్లు మన్నది. దడ ఎక్కువయింది. కళ్ళార్పకుండా వాళ్ల వైపుకే చూస్తూ, నిలబడిపోయాను. శశితలెత్తింది. ఉలిక్కిపడింది. గుటకలు వేస్తూ, ఆయాసపడుతోంది. వీళ్ళనుచూస్తే ఇంత భయము యెందుకు అని నాలో నేను అనుకున్నాను. శశికూడా తమాయించు కున్నట్లే వుంది. మొహం చిట చిట లాడించుకుంటూ చూసింది. పోలీసు ఆఫీసరు పెదిమలు వెడల్పుచేశాడు. ఆయన వాలకాన్ని అట్టేచూస్తున్నాను.

'సారీ...' అంటూ మొదలు పెట్టాడు 'రాజరావుగారు నిర్దోషి ...ఆయన డబ్బు బ్యాంకులో ఎత్తుకు పోలేదండి. అర్జంటుగా బ్యాంకుపనిమీద ఏదో ఊరు వెళ్ళాలసివచ్చి, జగన్నాథంగారిద్వారా మీకు కబురుచేశారు. ఆయన ఆ ముక్క మీకు చెప్పలేదు. మీకు అపోహ కల్పించాలని, రాజారావుమీద పగ సాధించాలని, ఆయన మీద లేనిపోని అభాండాలను కల్పించి, బ్యాంకు వాళ్ళచేతకూడా అబద్ధాల రిపోర్టు పంపించాడు....'

"ఆయన చెపుతేమాత్రం, బ్యాంకువాళ్ళు యెట్లా ఇచ్చారండి అలాంటి రిపోర్టు...." ఉద్రేకంగా అన్నాను.

"నిజానికి బ్యాంకువాళ్ళు ఇవ్వలేదండి....మేమే...."అంటూ పోలీసు ఆఫీసరు ఏదో చెప్పబోయాడు.

"నాన్‌సెన్స్ ..." ఉద్రిక్తుణ్ణయిపోయాను.

"తగ్గండి...." అన్నట్టు కుడిచేత్తో కిందకు చూపిస్తూ అతి నిర్లక్ష్యంగా తల వూపాడు పోలీసు ఆఫీసరు.

"కస్తూరి, క్లబ్ ఏనివర్సరీ షంక్షన్‌కు విశాఖపట్నంవెళ్ళి రాత్రేతిరిగివచ్చారు. ఆమెకుకూడా ఏమీతెలీదు...." పోలీసు ఆఫీసరు సగర్వంగా చెప్పుకుంటున్నాడు.

తాముచేసిన పరిశోధన అబద్ధమయిందని గర్వమో యేమొ! ఒళ్ళు మండిపోయింది. ఇంత రభస చేసి, ఇందర్ని ఆందోళన పరిచి, ఇంత తాపీగా,చెపుతున్న పోలీసు ఆఫీసర్ని చూస్తుంటే, ఏం చేసినా పాపం లేదనిపించింది.

"మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి...." అన్నాడు ఆయన.

అలాంటి క్షమాపణలకు యెలాంటి సమాధానం చెప్పాలో శశికి తెలియదు. ఆమె మెదలకుండావుంది.

సరే ఇక దయచేయండి అన్నాను కోపాన్నంత అణచుకుంటూ.

'మా మాట అట్లావుంచండి. ముందర మీరు దయచేయండి పోలీసు స్టేషనుకు....అన్నాడు నాచేతికి ఓ కాగితాన్నందిస్తూ.

గబ గబ చదువుతున్నాను. అది రాజారావు వ్రాసిఇచ్చిన కంప్లయింట్. పోలీసు ఆఫీసరుకు ఇచ్చిన ఫిర్యాదు. అది నామీద వ్రాసిననింద. శశితో, నేనుమాట్లాడటం ఆయనకు ఇష్టంలేదట. అది రాజారావు సంస్కారం శశిని అనుమానించక పోయినా, నన్ను బాగా అనుమానిస్తున్నాడట. అందుకనే ఆయన వూళ్లోంచి వెళ్ళిపోయినట్లు పుకార్లు పుట్టించి, తనఅనుమానాన్ని దృఢపర్చుకున్నాడుట. నా మీదలాంటి అభాండాన్ని మోపటానికి రాజారావుకి మనస్సెట్లా వచ్చిందో. బహుశా నేను పెళ్ళి చేసుకోలేదని కోపంతో నా మీద కసి తీర్చుకుంటున్నాడేమొ: ఆ క్షణంలో వచ్చిన ఆలోచన అట్టే యెగిరి పోయింది.

పోలీసు స్టేషన్లో కూర్చున్నా నన్నమాటేగానీ, పోలీసు ఆఫీసరు అడుగుతున్న ప్రశ్నలు నాకేమి వినిపించటం లేదు. ఎప్పుడో బుచ్చిబాబు వ్రాసిన 'నిప్పులేని పొగ' గుర్తుకొచ్చింది. నిప్పులేకపోయినా, పొగ వుండచ్చని ఇప్పుడు నాకు తెలిసింది. నేను నిందితుణ్ణి. నేరస్థుణ్ణి మాత్రంకాదు. రాజారావు ఇంత దారుణంగా అనుకోవటానికి గల కారణం ఏదైనా వుండి వుండాలి. నామీద అతనికి వున్న అపారమైన ప్రేమ గౌరవం కావచ్చు. అతన్ని మాత్రం అపార్థం చేసుకోవటానికి మనస్సొప్పడంలేదు. అంత మాత్రంచేత నేను బ్రహ్మచారిగా వుండిపోదామనుకున్న నిర్ణయాన్ని మార్చుకోలేను. మార్చుకోను.